క్లుప్తంగా

జిల్లా హ్యాండ్‌బాల్ జట్టుకు సిటీఎం విద్యార్థులు

మదనపల్లె సిటీ : మదనపల్లె మండలం సీటీఎం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు జ్యోతిప్రకాష్, కుషిలు ఉమ్మడి చిత్తూరు జిల్లా హ్యాండ్ బాల్ జటుట్కు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం రుషికేశవ్ తెలిపారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో జరిగే రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వీరిని పాఠశాల పీడీలు నాగరాజు, నరేష్‌బాబు, ఉపాధ్యాయులు అభినందించారు.

అన్నదానం

వాల్మీకిపురం : టీటీడీ ఆధ్వర్యంలోని స్థానిక శ్రీ పట్టాభిరామాలయంలో శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తుల కోసం విశేష దినాల్లో నిర్దేశించిన అనుమతులకు లోబడి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పలువురు దాతలు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ అధికారి క్రిష్ణమూర్తి, టీటీడీ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

23న మండల సమావేశం

కలికిరి : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 23న ఎంపీపీ నూర్జహాన్ అధ్యక్షతన మండల సాధారణ సభ్యసమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గంగయ్య తెలిపారు. సమావేశంలో అన్ని శాఖల నుంచి చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై చర్చ జరుగుతుందని, అన్ని మండల శాఖల అధికారులు తగిన సమాచారంతో హాజరవ్వాలన్నారు. అలాగే సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండల ప్రత్యేక ఆహ్వానితులు, మండల కో-ఆప్షన్ సభ్యులు హాజరు కావాలని ఆయన కోరారు.

నిధులు మంజూరు చేయండి

పీలేరు : పీలేరు గ్రామ పంచాయతీ అభివృద్ధికి ప్రత్యేక కోటా కింద నిధులు మంజూరు చేసి సహకరించాలని రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి సర్పంచ్ హబీబ్‌బాషా వినతి పత్రం అందజేశారు. శనివారం తిరుపతిలో మంత్రిని కలసి పీలేరు గ్రామ పంచాయతీలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాల గూర్చి విన్నవించారు. వారపుసంతలో షెడ్లు నిర్మాణం, రోడ్లు, కాలువలు, ఆర్‌వో ప్లాంట్లు ఏర్పాటుకు నిధులు కావాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

కలికిరి : జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల బాలికల గురుకుల పాఠశాలలో ఖాళీ ఉన్న పీజీటీ (ఫిజికల్ సైన్స్) పోస్టుకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వై.సోమశేఖర్ తెలిపారు. మహిళ అభ్యర్థులు మాత్రమే అర్హులని, బీఎస్సీ(ఎంపీసీ), ఎంఎస్సీ(ఫిజిక్స్), బీఈడీ(ఫిజికల్ సైన్స్ మెథడ్స్) ఆంగ్ల మాధ్యమం చదివి ఉండాలన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన వారు ఈ నెల 13వ తేదీలోపు దరఖాస్తులను పాఠశాలలో సమర్పించాలన్నారు. మరిన్ని వివరాలకు 9000715637, 7702218628 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఎమ్మెల్యే చొరవతో పాఠశాలకు దారి సౌకర్యం

కలికిరి : మండల పరిధిలోని కలికిరి రెడ్డివారిపల్లిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల దారి సమస్య ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి చొరవతో పరిష్కారమైంది. పాఠశాల ఏర్పాటైన నాటి నుంచి ఖాళీ స్థలం ఉండటంతో దారి ఉండేది. ప్రస్తుతం భూముల విలువ పెరగడంతో స్థల యజమానులు ప్లాట్లు వేసి విక్రయిస్తుడంటంతో పాఠశాలకు దారి ప్రశ్నార్థకంగా మారింది. సమస్య ఎమ్మెల్యే దృష్టికి వెళ్లడంతో పరిష్కరించాలని ఎంపీడీఓ, ఎంఈవోలను ఆదేశించారు. దీంతో దాతలైన ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, దేవేంద్ర రెడ్డి, జి.వెంకటక్రిష్ణారెడ్డి, ఎం.శివారెడ్డిలను సంప్రదించి దారి సౌకర్యానికి చర్యలు చేపట్టారు. ఈ మేరకు దాతలు ప్రభుత్వానికి దారి స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించారు. దీంతో పాఠశాలకు పక్కాగా దారి ఏర్పాటైంది. గ్రామస్తులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి ఆర్థిక సాయం

ములకలచెరువు: మండలంలోని బిసయ్యగారిపల్లెకు చెందిన ఆనంద్‌రెడ్డి (45) రోడ్డు ప్రమాదంలో పది రోజుల క్రితం గాయపడ్డాడు. సమాచారం అందుకున్న పారిశ్రామికవేత్త జయచంద్రారెడ్డి, ఆంజనేయరెడ్డి శనివారం వైద్య ఖర్చుల కోసం రూ. 10 వేలు ఆర్థిక సహాయం అందించారు.

నెరవేరనున్న సొంతింటి కల

బి.కొత్తకోట నగర పంచాయతీలో..	
మంజూరైన ఇళ్లు	1,227
పూర్తయినవి	215
వివిధ దశల్లో	676
చెల్లించిన బిల్లులు	రూ.8,94,00,432
బి.కొత్తకోట రూరల్..	
మంజూరైన ఇళ్లు	1,164
పూర్తయినవి	429
వివిధ దశల్లో	817
చెల్లించిన బిల్లులు	రూ.10,74,33,692


కురవానికుంట లేఅవుట్‌లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలు

బి.కొత్తకోట : ఏళ్ల తరబడి ఇంటిస్థలాలు, పక్కా గృహాల కోసం ఎదురుచూస్తున్న పేదల కల నవరత్నాలు–పేదలందరికి ఇళ్ల కార్యక్రమం ద్వారా సాకారమైంది. బి.కొత్తకోట నగర పంచాయతీ, బి.కొత్తకోట మండలంలోని అర్హులైన పేదలకు ఇంటి స్థలాలను, పక్కా గృహాలను మంజూరు చేశారు. వీటిని పొందిన పేదలు ఆనందంతో ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. నిర్మాణాలకు ప్రభుత్వం ఉచితంగా ఇసుక, యూనిట్ విలువ సొమ్ములో సిమెంట్, కమ్మి, ఇంటి కిటికీలు, గుమ్మాలు, ద్వారాలను తక్కువ ధరకే నాణ్యమైన వాటిని ప్రభుత్వమే సరఫరా చేస్తోంది. మండలానికి 2,391 పక్కా గృహాలు మంజూరవగా అందులో 1,227 గృహాలు నగర పంచాయతీ పరిధిలో, 1,164 గృహాలు మండల పరిధిలో మంజూరు చేశారు. లబ్ధిదారులకు ఇంటిస్థలాల కోసం నగర పంచాయతీలో కురవానికుంట, బద్దిపల్లె లేఅవుట్లు, మండల లబ్ధిదారుల కోసం బడికాయలపల్లె, గుడిపల్లె, బీరంగి, తుమ్మనంగుట్ట, గట్టు, కోటావూరు, పత్రవారిపల్లె, గోళ్లపల్లెల్లో లేఔట్లు వేసి లబ్ధిదారులకు ఇళ్లస్థలాలు కేటాయించారు.

జగన్ న్యాయం చేశారు



ఒంటరి మహిళ అయిన నాకు ఇంటిస్థలం, పక్కా గృహం మంజూరు చేయాలని అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా కనికరించలేదు. జగనన్న సీఎం అవ్వగానే ఇంటిస్థలం, ఇల్లు మంజూరు చేశారు. రేషన్‌కార్డు కూడా మంజూరైంది. ఇంత త్వరగా మంజూరు చేసి నా ఇంటి కల నెరవేర్చిన సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

-కే.సుజాత, బి.కొత్తకోట

సొంతిల్లు కల తీరింది



సొంతింటిలో జీవించాలన్న కల సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారు. పేద కుటుంబమైన తమకు ఇంటిని నిర్మించుకునే స్తోమత లేదు. ఇంటిస్థలంతో పాటు పక్కా గృహాన్ని మంజూరు చేసి గూడు కల్పించారు. ప్రభుత్వం అందించిన సహకారం మరువలేం. పేదలంతా సీఎం వైఎస్ జగనకు అండగా ఉంటాం.

-ఆర్.రాధమ్మ, బడికాయలపల్లె

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

పీలేరు : పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం ఎమ్మెల్యే పీలేరు పట్టణంలోని పద్మావతి నగర్, ఆర్టీసీ నల్లగుట్ట తదితర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం నుంచి లబ్ధిపొందిన వివరాలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి కుటుంబం రూ. లక్ష నుంచి రూ. పది లక్షల వరకు ప్రభుత్వం నుంచి ఆర్థికంగా లబ్ధి పొందినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త ఆలోచనలతో అభివృద్ధి, సంక్షేమ పథకాలతో దూసుకుపోతోందని చెప్పారు. గత ప్రభుత్వం జన్మభూమి కమిటీల పేరుతో ఒక వర్గానికి మాత్రమే పథకాలు అందించేవారని తెలిపారు. అదే ప్రస్తుతం ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి కుల మత రాజకీయ వర్గాలకు అతీతంగా అన్ని వర్గాలకు పథకాలు అందిస్తున్నారని చెప్పారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఏదో విధంగా సంక్షేమ పథకాలు అంది ఆర్థిక లబ్ధి చేకూరుతోందని తెలిపారు. ఇచ్చిన హామీల్లో దాదాపు వంద శాతం అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రికే దక్కిందన్నారు. ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చిన సమస్యలు అప్పటికప్పుడే సంబంధిత అధికారులకు తెలిపి పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి, జెడ్పీటీసీ ఎ.టి. రత్నశేఖర్‌రెడ్డి, జి.వి. రాకేష్‌రెడ్డి, సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దండు జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ రీజనల్ మహిళా కోఆర్డినేటర్ మహితా ఆనంద్, ఏపీ వేర్‌హౌస్ కార్పొరేషన్ డైరెక్టర్ నాగరాజమ్మ, వైస్ ఎంపీపీలు ఎన్.వి. చలపతి, హరిత, పార్టీ రాష్ట్ర కార్యదర్శి హుమయూన్, నాయకులు సచిన్, బారేషా, జయపాల్‌రెడ్డి, షేక్‌షావలి, శ్రీరామసుధాకర్, వెంకటేష్, నాగవేణి, రాజేశ్వరి, కాలనీ చిన్న, షాకీర్ తదితరులు పాల్గొన్నారు.


ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

‘పల్లెబాట’ విజయవంతం చేద్దాం

పెద్దమండ్యం : పల్లెబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎండీసీ అధ్యక్షుడు గుర్రం రమేష్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం పల్లెబాట కార్యక్రమం నిర్వహణపై అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి సెప్టెంబరు 7వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాలలో పల్లెబాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పీరమ్మ, వైస్ ఎంపీపీ టి. జయచంద్రారెడ్డి, తహసీల్దార్ రాము, ఎంపీడీఓ శ్రీధర్‌రావు, సర్పంచ్‌లు బాషా, విశ్వనాథరెడ్డి, ఎంపీటీసీలు ఎం. జయరాం, సి రుక్మాంగధరెడ్డి, ఆయా శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పాలనను ఆశీర్వదించండి

పెద్దతిప్పసముద్రం : కుల, మతాలు, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాల ద్వారా అన్ని వర్గాలకు లబ్ధి చేకూరుస్తున్న ప్రభుత్వాన్ని మళ్ళీ ఆశీర్వదించాలని ప్రజా ప్రతినిధులు ప్రజలను కోరారు. శనివారం పల్లెబాటలో భాగంగా శనివారం ఎంపీపీ మహమూద్, జెడ్పీటీసీ శివన్న, జేసీఎస్ కన్వీనర్ డ్రిప్ రమణలు మండల స్థాయి అధికారులతో కలసి మండలంలోని సంపతికోట పంచాయతీలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్ళి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత నాలుగేళ్ళ పాలనలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ద్వారా ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. సుపరిపాలన అందిస్తున్న సీఎం వైస్ జగన్‌ను వచ్చే ఎన్నికల్లో మళ్ళీ అండగా నిలవాలని కోరారు. స్థానికంగా సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకు వస్తే వాటిని తక్షణమే పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామని భరోసా ఇచ్చారు. అర్హత ఉండి పథకాలు అందని వారు ఎవరైనా ఉంటే వలంటీర్ల ద్వారా సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు రెడ్డెప్ప, కిట్టన్న, మధు, కుంచే శీను, మాచిరెడ్డి శంకర్‌రెడ్డి, రాఘవ, పోతుపేట వెంకటేష్, రఘునాథ్‌రెడ్డి, వేంపల్లి రమణ, రియాసత్ అలీఖాన్, పల్లిగడ్డ కిట్టన్న, వెంకట్, గణపతిరెడ్డి, జనార్దన్‌తో పాటు అధికారులు గిరిధర్‌రెడ్డి, విద్యాసాగర్, హరి, ఉత్తన్న, నాగరత్నమ్మ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.


పల్లెబాటలో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

ఆలయానికి చేయూత

కానగమాకులపల్లిలో వెలసిన మారెమ్మ గుడి ఆలయ అభివృద్ధి కోసం ముంతపోగులవారిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మాచిరెడ్డి శంకర్‌రెడ్డి రూ.5 వేల నగదును విరాళంగా అందజేశారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

- ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమం రెండుకళ్లుగా పనిచేస్తున్నారని, గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అధికారులకు సూచించారు. మండల సాధారణ సర్వసభ్య సమావేశం శనివారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రెడ్డెమ్మ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ఎమ్మెల్యే నవాజ్‌బాషా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా వివిధ ప్రభుత్వశాఖల అధికారులు తమ తమ శాఖలకు సంబంధించిన ప్రగతిని, అమలవుతున్న పథకాలను, జరుగుతున్న పనులపై సమావేశంలో సభ్యులకు వివరించారు. ఎంఈఓ-2 రాజగోపాల్ పాఠశాలల్లో అమలవుతున్న నూతన విద్యావిధానంపై సభ్యులకు అవగాహన కల్పించారు. హౌసింగ్‌శాఖకు సంబంధించి ఏఈ దీనదయాళ్‌రాజు మండలంలో 4,882 ఇళ్లు మంజూరైతే 1,744 ఇళ్లు వందశాతం పూర్తి అయి ఫైనల్ బిల్లులు చెల్లించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే నవాజ్‌బాషా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. సింగిల్‌విండో చైర్మన్ దండుకృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీలు పసుపులేటిరమణ, నందినిశాజ్, ఆర్‌బీకే చైర్మన్ కత్తిరాజు, మార్కెట్‌కమిటీ వైస్‌చైర్మన్ జి.వెంకటరమణ, డైరెక్టర్ తట్టిశ్రీనివాసులురెడ్డి, ఎంపీడీఓ భానుప్రసాద్, తహసీల్దార్ మహబూబ్‌చాంద్ పాల్గొన్నారు.


సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

ప్రజలకు మంచి చేయడమే లక్ష్యంగా..

నిమ్మనపల్లె : ప్రభుత్వ అధికారులు, సచివాలయ సిబ్బంది ప్రజలకు మంచిచేయడమే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. శుక్రవారం స్థానిక మండలపరిషత్ సమావేశ భవనంలో ఎంపీపీ నరసింహులు అధ్యక్షతన మండల పరిషత్ సాధారణ సర్వసభ్యసమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే వివిధ శాఖల త్రైమాసిక ప్రగతి నివేదికలను పరిశీలించారు. అంశాల వారీగా అభివృద్ధిపై సమీక్షించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్‌రెడ్డి, మండల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ రమణారెడ్డి, వైస్ ఎంపీపీ జయప్రకాష్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు మహమ్మద్‌రఫీ, ఎంపీడీఓ శేషగిరిరావు, తహసీల్దార్ సీ.ఆర్.మంజుల పాల్గొన్నారు.

అధికారులు గ్రామాల్లో పర్యటించాలి

రామసముద్రం : అధికారులు కార్యాలయాలకు పరిమితంకాకుండా గ్రామాలకు వెళ్లి ప్రజలకు సమస్యలు పరిష్కరించి, వారికి అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే నవాజ్‌బాషా తెలిపారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కుసుమకుమారి అధ్యక్షతన సాధారణ సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. జెడ్పీటీసీ రామచంద్రారెడ్డి, వైస్‌ఎంపీపీ గంగాధర్‌నాయుడు, ఎంపీడీవో నారాయణస్వామి, డీటీ నాగరాజురావ్, మండల కన్వనర్ భాస్కర్‌గౌడ్, సర్పంచ్‌లు , ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

పీలేరు రూరల్ : వచ్చేనెల 9న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి ఎం. శ్రీనివాసులునాయక్ అన్నారు. శనివారం స్థానిక కోర్టులో నిర్వహించిన సమావేశంలో జడ్జి మాట్లాడుతూ కక్షిదారులకు రాజీమార్గమే రాజమార్గమని పేర్కొన్నారు. జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయడానికి పోలీస్ అధికారులు, న్యాయవాదులు, బ్యాంకు అధికారులతో కక్షిదారులను ఒప్పించడానికి కృషి చేయాలన్నారు.

మదనపల్లె సిటీ : ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో వచ్చే నెల 9న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయసేవా అథారిటీ కార్యదర్శి కరణ్ కుమార్ అన్నారు. శనివారం స్థానిక రెండ అదనపు జిల్లా కోర్టు భవనంలో లోక్‌అదాలత్ నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అజాదీకా హింద్ మహోత్సవాల్లో భాగంగా 10 లక్షల మొక్కలు నాటాలన్నారు.


మాట్లాడుతున్న జడ్జి ఎం.శ్రీనివాసులునాయక్

తంబళ్లపల్లె: స్థానిక జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులో వచ్చే నెల 9వ తేదీన జరిగే లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్థానిక న్యాయమూర్తి ఉమర్‌ఫరూఖ్ సూచించారు. శనివారం స్థానిక కోర్టులో తంబళ్లపల్లె, పెద్దమండ్యం, ములకలచెరువు, పీటీయం ఎస్ఐలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

ఘనంగా శ్రావణమాస పూజలు

మదనపల్లె సిటీ : శ్రావణ మాసం మొదటి శనివారం పురస్కరించుకుని స్థానిక దేవళంవీధిలోని శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల కోసం ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ ఆవరణంలో ఉత్సవమూర్తులకు ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. గోవిందనామాలతో ఆలయం మార్మోగింది. స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఈఓ రమణ, అర్చకులు గోవర్ధన్‌భట్టార్‌లు పాల్గొన్నారు. స్థానిక బసిని కొండపై వెలసిన శ్రీ వెంకటరమణస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

కిక్కిరిసిన ఆలయాలు

గుర్రంకొండ : మండలంలోని పలు గ్రామాల్లో శ్రావణమాసం ప్రారంభం కావడంతో శనివారం ఆలయాలు పండుగ శోభతో కిక్కిరిసిపోయాయి. ఆంజనేయస్వామి, శ్రీమంజునాథస్వామి ఆలయాల్లో ఎ ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. తరిగొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో టీటీడీ వారి ఆధ్వర్యంలో విశిష్టమైన పూజలు నిర్వహించారు.


ఉత్సవ మూర్తులకు పూజలు చేస్తున్న అర్చకులు

వార్డుసభ్యుల ఎన్నిక ఏకగ్రీవం

మదనపల్లె : మండలంలో ఖాళీగా ఉన్న మూడు గ్రామవార్డు సభ్యుల ఎన్నికలకు సంబంధించి ఏకగ్రీవంగా ఎన్నిక జరిగినట్లు ఎంపీడీఓ భానుప్రసాద్ తెలిపారు. పొన్నూటిపాళ్యం వార్డునెంబర్.4(ఓసీ.జనరల్), పెంచుపాడు వార్డు నెంబర్ 2(ఎస్సీ మహిళ), కోటవారిపల్లె వార్డునెంబర్ 1(ఓసీ.జనరల్)కు ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణలో ప్రతి వార్డుకు ఒక నామినేషన్ మాత్రమే వచ్చిందన్నారు. దీంతో పొన్నూటిపాళ్యం వార్డునెంబర్ 4 సభ్యుడిగా వి.లక్ష్మన్న, పెంచుపాడు వార్డునెంబర్ 2 సభ్యుడిగా జె.లక్ష్మీదేవి, కోటవారిపల్లె వార్డు మెంబర్‌గా ఎ.అమరనాథ్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారన్నారు.

కలకడలో ఇద్దరు..

కలకడ : మండలంలోని రెండు పంచాయతీలలో నిర్వహించిన రెండు స్థానాలలోని వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎంపికైనట్లు ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని నడిమిచెర్ల పంచాయతీ 6వ వార్డుకు ఇరగంరెడ్డి, కలకడ టౌన్ 1వవార్డుకు రిజ్వానాబేగం ఏకగ్రీవంగా ఎంపికైనట్లు ఎంపీడీఓ తెలిపారు.

యానిమేటర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలి

కలకడ : కనీస వేతనాలకు విధులు నిర్వహిస్తున్న యానిమేటర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించి ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామాంజులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక వెలుగు కార్యాలయంలో మండల యానిమేటర్స్ యూనియన్ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం విడుదల చేసిన జీఓ 64 కేవలం మూడు సంవత్సరాలకే పరిమితం చేసి అన్యాయం చేశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 28వేల మంది కుటుంబాలు ఆందోళనలో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనం మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డెప్ప, ఉపాధ్యక్షురాలు క్రిష్ణమ్మ, యూనియన్ సభ్యులు కన్యకుమారి, చెన్నమ్మ, ప్రసన్న పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతోనే ఉజ్వల భవిష్యత్తు

మదనపల్లె : విద్యార్థులు సత్ప్రవర్తనతోనే ఉజ్వల భవిష్యత్తు పొందగలరని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి, సీనియర్ సివిల్‌జడ్జి ఐ.కరుణకుమార్ పేర్కొన్నారు. శనివారం స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి కరుణకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సామాజిక బాధ్యతలు తీసుకోవాలన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 14 ఏళ్లలోపు పిల్లలకు నిర్బంధ విద్య హక్కు చట్టం అమలుకు సహకరించాలన్నారు. విద్యార్థిదశలో అనవసర విషయాలను పక్కనపెట్టి చదువుపైనే దృష్టి పెట్టాలన్నారు. ప్రతి ఒక్కరిలోనూ ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుందని, వారు ఎంచుకున్న రంగంపై దృష్టి పెట్టాలని సూచించారు. జన్మనిచ్చి, పోషించి, పెద్దవారిని చేసిన తల్లిదండ్రులను మంచిగా చూసుకోవాలని జడ్జి సూచించారు. సమావేశంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి మంజులత, కరస్పాండెంట్ డాక్టర్.ఆర్.గురుప్రసాద్, ప్రిన్సిపాల్ ఎస్.రమాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జడ్జి కరుణకుమార్

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి

తంబళ్లపల్లె : జగనన్న కాలనీలలో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ సురేంద్రనాథ్ కోరారు. శనివారం వారు జగనన్న కాలనీలలను సందర్శించి లబ్ధిదారులతో చర్చించారు. ప్రభుత్వం కేటాయించిన ఇంటి పట్టా స్థలంలోనే ఇళ్లు నిర్మించుకోవాలన్నారు. పట్టాలు ఇచ్చి, ఇంకా స్థలాలను చూపని లబ్ధిదారులకు వెంటనే స్థలాలు కేటాయించాలని ఆర్ఐ రవి, హౌసింగ్ ఏఈ సుజాత, ఇంజనీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. రోజూ ఇంటి నిర్మాణ పనులను పర్యవేక్షించాలన్నారు. అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వస్తే సంబంధిత ఉద్యోగులపై చర్యలు తప్పవన్నారు. ప్రతి పేదవాడికి ఇల్లు ఇవ్వాలనే సంకల్పంతో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి కృషి చేస్తున్నారన్నారు. అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నాయకులు శ్రీనివాసులు, రామూర్తి, నరసింహనాయుడు, పంచాయితీ కార్యదర్శులు రమణ, సోమశేఖర్ ఉన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

తంబళ్లపల్లె : గ్రామాల్లో ఎవరూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడనా చర్యలు తప్పని ఎస్ఐ లోకేష్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం రాత్రి మర్రిమాకులపల్లెలో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. సర్పంచు కె.జ్యోతి ఆధ్వర్యంలో గ్రామస్తులతో చర్చించారు. పోలీసులంటే భయంవీడి న్యాయం కోసం ఏ సమయంలోనైనా పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించవచ్చున్నారు. గ్రామాల్లో తగాదాలు, ఘర్షణలకు పాల్పడకుండా ఐక్యంగా ఉండాలన్నారు. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

సబ్సిడీపై రాయితీ ఉలవలు

కేవీపల్లె : ప్రభుత్వం 80 శాతం రాయితీతో అందిస్తున్న ఉలవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి శ్రావణి తెలిపారు. శనివారం రైతు భరోసా కేంద్రాలకు చేరిన రాయితీ ఉలవలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ, కంది పంటలు 25 శాతం మాత్రమే సాగు చేశారని తెలిపారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా వేరుశనగ సాగు చేయని రైతులు ఉలవలు సాగు చేసుకోవాలని కోరారు.